"ఎలా చెప్పగలమండీ. విద్యకన్న డాంబికం, ఆడంబరం అవసరమైన కాలమండీ ఇది. మాకు ఆర్థిక సహాయం కావల్సినంత జరిగితే తప్పకుండా ఇది కొన్ని లక్షలమందికి సహాయపడేటట్లు చేస్తామన్న నమ్మకం మాకున్నది. ఇంకా కొన్ని యంత్రాలు అవసరం." అన్నారు కృష్ణవేణిగారు.

ఆవిడ ఊహల్లో విజయవాడలో ఈ మాగ్నటో థెరపీ, హెర్బల్ క్లినిక్‌లకు విశ్వవిద్యాలయమే వెలిసింది.

ఆవిడ దృష్టి మరల్చడానికి, "మీరు మా 'వనిత'లో మాగ్నటో థెరపీ గురించి సేకరించిన వ్యాసాలు చదివారా?"

వెంటనే ఆమెలో ఉత్సాహం వచ్చింది.

"చదివామండీ! మీరు చాలా సాహసం చేశారనే చెప్పాలి. ఇవి చదివే, ఇల్లాంటి సైన్సస్ కూడా మేగజైన్స్ ప్రోత్సాహం ఇస్తాయన్న నమ్మకం వచ్చింది మాకు. ఎందుకు అంటున్నానంటే కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ప్రయత్నం తక్కువైపోయిందండీ. ఏదో డాక్టర్స్ దగ్గరకు వెళ్ళడం, యాంటీ బయాటిక్స్ వేసేసుకోవడం—దీనితో కథ సరి.

"అయితే ఒక విషయం మీకు చెప్పాలి. మీరు బన్సాల్ వైద్య విధానాన్ని సూచించారు. ఒక విధంగా ఆ విధానం మీద విపరీతమైన వివాదాలు ఉన్నాయి. సరైన మాగ్నటో తెరపిస్ట్ గైడెన్స్ లేకపోతే ఆ ఫలితాలు బాగాలేవు. ఇది పుస్తకాలు చదివి చేసే వైద్యం మాత్రం కాదు. దీనికి మానవత్వం, వైద్యశాస్త్రం పూర్తిగా తెలిసిన డాక్టర్సు కావాలి." వివరిస్తూ చెప్పారు డా॥ మోహన కృష్ణమూర్తి.

చాలా థ్యాంక్స్. ఈ విషయం వివరించినందుకు. డాక్టర్సు కానీ, రోగులు కానీ, మీకు ఉత్తరాలు రాస్తే జవాబు ఇచ్చివాళ్ళ సందేహం తీరుస్తారా?

"తప్పకుండా....ఎవరికైనా మా సహకారం ఎప్పుడూ ఉంటుంది." మా అడ్రసు:

డా॥ ఎస్. కృష్ణవేణి
(మాగ్నటో తెరపిస్ట్)
శాంతి థియేటర్ ఎదురుగా
గాంధినగర్, విజయవాడ–520 003.

[గోష్ఠి నిర్వహణ: జలంధర]

## చిట్టి కథ

# కలలరాణి!



ఒక రోజు ట్రిమ్‌గా తయారయి ఆఫీసుకు వెళ్తున్న సుకుమారిని ఓ అపరిచిత స్త్రీ ఎంతో మర్యాదగా పలకరించింది...."ఏమండీ మీ పేరు సుకుమారి కదూ!" అంటూ.

"అవునండీ... మీకెలా తెల్సు?" అంది సుకుమారి ఆశ్చర్యంగా చూస్తూ.

"అదేమిటండీ అలా అడుగుతారు? మీరింత అందంగా స్మార్ట్‌గా ఉంటారు. మడత నలగని ఇస్త్రీ చీరలు చక్కగా కట్టుకుంటారు. ఆ లిప్ స్టిక్, ఆ హెయిర్ స్టయిల్, హాండ్ బాగ్ నుండి పక్క పిన్నుల దాకా ఆ చక్కని మాచింగ్....డ్రీమ్ గర్ల్ కదండీ మీరు. డ్రీమ్‌గర్ల్! ఎవరైనా క్యూరియాసిటీ చూపిస్తారు మరి!" అందామె గలగలా నవ్వేస్తూ.

లాటరీలో మొదటి బహుమతి దొరికినంత ఆనందంగా ఉంది సుకుమారికి. కాస్త గర్వంగా కూడా ఫీలయింది.

"థాంక్స్ అండీ..." అంది కాస్త సెల్ఫ్ కాన్షస్‌గా ఫీలవుతూ, చీర కుచ్చెళ్ళు సరిచేసుకుంటూ.

"మీరేం అనుకోకపోతే .... ఓ పర్సనల్ విషయం. మీకింకా పెళ్ళవలేదు కదూ!" అందామె సుకుమారిని పరిశీలనగా చూస్తూ. లేదన్నట్లు తలూపింది సుకుమారి, ఈమె మారేజ్ బ్రోకర్ కాబోలు! అని మనసులో అనుకుంటూ.

"మంచి చదువుండి, ఉద్యోగం ఉండి సూటూ బూటూ వేసుకుని కారులో ఆఫీసుకు వచ్చేవాడయితే ... అలాటి సంబంధం అయితే బాగుంటుంది కదూ!"

అవునన్నట్లు తలూపింది సుకుమారి కాస్త తికమకగా ఫీలవుతూ.

"ఆ వ్యక్తి అందంగా ఆరోగ్యంగా స్మార్ట్‌గా మన హిందీ సినిమాల హీరోలా ఉండాలి కదూ!"

మళ్ళీ తల ఊపింది సుకుమారి.

"మరి.... అతను కట్నం డబ్బు ముక్కుపిండి వసూలు చేసేవాడయితేనో? పెళ్ళాన్ని కాల్చుకు తినేవాడయితేనో? ఇంటికి రాగానే పిల్లల్ని చావబాదేవాడయితేనో? బంగారం బొమ్మలాంటి పెళ్ళాన్ని ఇంట్లో పెట్టుకుని బయట గర్ల్‌ఫ్రెండ్స్‌ని వెంటేసుకుని కారులో షికార్లు తిరిగేవాడయితేనో? రోజుకు ఆరు సిగరెట్ పాకెట్లు, రెండు బ్రాందీ బుడ్డీలు లాగించేవాడయితేనో? సాయంత్రం కాగానే పేకాటకి క్లబ్బుకు...." ఆమె చెప్పుకుంటూ పోతోంది. సుకుమారికి తల తిరిగిపోతోంది.

"బాబోయ్.... చాలిక ....ఆపండి. అలాటి వాణ్ని ఛస్తే చేసుకోనండోయ్" అంది భయంగా చూస్తూ.

"అయితే అలాటి వాడి వెంట ఎందుకండీ తిరుగుతారు తోక చుక్కలాగా? వృధా శ్రమ.... అరే! అదేమిటి అలా చూస్తున్నారు గుడ్లు మిటకరించి?! మీ ఆఫీసరు నా మొగుడు!" అనేసి విసవిసా నడుస్తూ చక్కా పోయింది ఆమె, సుకుమారి షాక్ నుండి తేరుకునేలోపల!

—ఎమ్. నాగమణి, తిరుపతి